# సిరి మెరికలు

బి. పి. కరుణాకర్

తెల్లటి చీర కప్పుకుని పండుకుంది ప్రకృతి. చల్లటి గాలిలో వెన్నెల లుంగలు చుట్టుకు పోతుంది. నైట్‌క్వీన్ పువ్వుల పరిమళానికి నా మనస్సు మత్తెక్క సాగింది. ప్రక్కగా నుంచున్న కొబ్బరి ఆకులు గాలికి కదిలి అదోరకమైన సంగీతాన్ని ఆలాపిస్తున్నాయి.

నరహరి నేను మేడమీద కూర్చున్నాం, పండు వెన్నెల్లో ఆలా కూర్చున్నప్పుడు నా జీవితం ఒక్కసారి వెనక్కు తిరిగి నాకళ్ళ ముందు నిలుస్తుంది, గడచిన అనుభవాల జీర్ణాలు ఒక్కసారి ఎదురుతిరిగి మనస్సు ఆనందాను భూతితో మూలుగుతుంది.

మెట్లమీద చప్పుడు వినిపించింది తలతిప్పి చూసాను. గాయత్రి మెల్లగా అడుగులు వేసు కుంటూ వచ్చింది. వెన్నెల మూర్తీభవించినటుగా వుంది. నల్లఅంచు తెల్లటిచీర కట్టుకుంది. అదేరంగు నల్లటి సిల్కుజాకెట్ వేసుకుంది. తలలో నిండుగా మల్లెపూలు నుదుటి మీద బొట్టు ఆమె అందాన్ని మరో మెట్టు పెంచినట్లు వుంది.

గాయత్రి ఒక కిళ్ళీ భర్తవైపు చాచింది

"ముందు పాండుకు యివ్వు" అన్నాడు నరహరి.

"ఇస్తాను" అంది గాయత్రి. గాయత్రి కంఠంలో అదో రకమైన తీయదనం ఉంది. నిజంగా నరహరి అదృష్ట వంతుడు అనుకున్నాను.

గాయత్రి ఇచ్చిన కిళ్ళీ తీసుకున్నాను. నరహరి కిళ్ళీ వేసుకుని నాకు సిగరెట్ ఇచ్చి తనో సిగరెట్ వెలిగించాడు గాయత్రి నరహరి ఎదురుగా కూర్చుంది. నైట్‌క్వీన్, మల్లెపూల పరిమళాలు పోటీ పడ్తున్నాయి చల్లటి వెన్నెల్లో కూర్చుని సిగరెట్ కాలుస్తూవుంటే అంతకన్న హాయి మరోటిలేదు అనిపిస్తుంది నాకు. చాలసేపటి వరకూ మౌనంగా కూర్చున్నాము. నరహరి ఏదో కూనిరాగం తీస్తున్న వాడల్లా ఆగి,

"మిలటరీ జీవితం ఎలా వుండేదీ!" అడిగాడు.

నవ్వాను. "ఏం చెప్పమంటావు?" అన్నాను.

"బాగానే వుండేదా?"

"ఆహాఁ, ఒకొక్కప్పుడు ఎందుకు వచ్చిన బాధ అనిపిస్తుండేది. మళ్ళీ ఆబాధలోనే తీయదనం. వచ్చేప్పుడు ఎందుకు వచ్చేదాన్నా అనిపించింది. కాని ఏంచేస్తాం. తప్పదు" అన్నాను.

"మీ ప్రూరు ఎప్పుడు వెళ్తున్నావు?"

"రెండు మూడు రోజులలో. మీ అన్నయ్య దగ్గరకు వెళ్ళమంటావా?" అడిగాను.

నరహరి "వద్దు" అన్నాడు.

"ఎందుకు?"

నరహరి మాట్లాడలేదు. కొబ్బరి ఆకుల్లోకి చూస్తున్నాడు, నరహరి నేను కలసి చదువుకున్నాం. నరహరికి వాళ్ళ అన్నయ్యా తప్ప ఎవరూ లేరు. వాళ్ళ అన్నయ్యే నరహరిని చదివించాడు. నే నెక్కడో దూరంగా విసిరి వేయబడ్డాను. నా స్నేహితులంతా దాదాపు నన్ను మర్చిపోయారు - ఒక్క నరహరి తప్ప కనీసం నెలకు ఉత్తరమైనా వ్రాస్తుంటాడు. అందుకే వాడంటే ఇప్పటికీ నాకు గౌరవం ఉంది. అప్పటికీ ఇప్పటికీ వాడిలో మార్పు లేదు. నాకు ఆదేచాలు.

'మా అన్నయ్య నాతో మాట్లాడటం మాని వేసాడు,' అన్నాడు నరహరి. ఎందుకు అని నేనడగలేదు. తనె చెప్పాడు 'నాకోసారి డబ్బు అవసరమైంది ఆ సమయంలో అన్నయ్యను అడిగాను, లేదనకుండా ఇచ్చాడు. తిరిగి తీర్చుదామని ఎప్పటి కప్పుడు అనుకుంటూనే వున్నాను. తీసుకునేప్పుడు ఎలా తీర్చగలను అనే ప్రశ్న నాలో కలుగలేదు. తిరిగి ఇచ్చేటప్పుడు అనిపిస్తుంది- నాలో అంత సమర్ధత లేదని. ఎన్ని ఖర్చులు! నా దగ్గర జీతం వచ్చాక ఒక్క కానీ మిగలదు ఇన్ని అప్పులు ఎలా అయినాయో నాకే అర్థం కాదు. ఎన్నని తీర్చేది! నాలుగు వేలు ఎక్కడ్నుంచి తెచ్చేది.' చెప్పేవాడలా ఆగిపోయాడు సిగరెట్ దూరంగా విసిరివేసాడు.

'అన్నయ్యకు ఆ మాటే చెప్పి మెల్లగా తీర్చుకుంటానన్నాను, అంతే. అన్నయ్య నా దగ్గరకు రావడం మాని వేసాడు, ఉత్తరాలుకూడా ఆగిపోయాయి' అన్నాడు నరహరి.

నేనేం మాట్లాడలేదు గాయత్రి గడ్డం క్రింద చేయిపెట్టుకుని దూరంగా చూస్తూ వుంది. నరహరి కొద్దిసేపటికి మామూలు మనిషి అయిపోయాడు. సన్నగా కూని రాగం తీయసాగాడు

'వంటకాలు ఎలా వున్నాయి?' గాయత్రి అడిగిన ప్రశ్నకు నా ఆలోచనల్లోంచి జారుకుని ఆమెవైపు చూసాను. ఆమె కళ్ళచుట్టూ కాటుకలాంటి చీకటి నీడలలో ఏదో అవ్యక్తం కాని విచారం ద్యోతక మౌతుంది,

'చాలా బావున్నాయి.' అన్నాను.

'అబద్ధం'

'కాదు. చాల చక్కగా కుదిరాయి'

గాయత్రి సన్నగా నవ్వింది. గడ్డంక్రింద చిన్న సొట్ట పడింది, పెదాలు మెల్లగా

ముందుకు వంగాయి కల్యాణి నవ్వినప్పుడూ ఆమె పెదాలు అలానే వంగుతాయి.

'కాని మీరేమీ తినలేదు మీకు నిజంగా భోజనం నచ్చినట్టులేదు' అన్నది

'అదేం కాదు. భోజనం చాల బావుంది' కాని ఇవ్వాళ ఆకలిగాలేదు.'

'వీడికి మొహమాటం జాస్తి' అన్నాడు నరహరి

'అలానే వుంది'

'కాదు. మీరనుకున్న దానికంటే కాస్త ఎక్కువగానే తిన్నాను. ఇంటి భోజనంతిని చాల రోజులవుతుంది.' అన్నాను.

దూరంగా చర్చిలో గంటలు కొడ్తున్నారు వేపచెట్టుమీద కాకులు ఒక్కసారిగా ఎగిరి గొడవ చేస్తున్నాయి.

నరహరి మరో సిగిరెట్ వెలిగించాడు.

'కల్యాణి ఎక్కడ వుంది?' అడిగాడు.

నవ్వాను.

'కల్యాణి ఎవరు?' అడిగింది గాయత్రి.

నరహరి గాయత్రికి ఏమిటో చెప్పాడు. గాయత్రి సన్నగా నవ్వింది.

"విశాఖలోనే వుండాలి." అన్నాను

"పెళ్ళి అయిందా?"

"ఎవరో ప్రొఫెసర్‌తో అయిందని విన్నాను." ఈ మాటలు అంటున్నప్పుడు నా హృదయం అవ్యక్తం కాని బాధతో చుట్టుకు పోయింది. ఇప్పుడు నా కెవరూలేరు ఆల్ ఆల్ ఆర్ గాన్ ది ఓల్డ్ ఫెమిలియర్ ఫేసెస్ అంతే.

"మీరేమీ అనుకోకుండా ఉంటే మిమ్మలను ఒక మాట అడగాలని ఉంది" అన్నది గాయత్రి.

తలెత్తి ఆమెవైపు చూసాను గాయత్రి తల వంచుకుంది. నరహరి చంద్రుడు చుట్టూ చేరిన మేఘాలను చూస్తున్నాడు.

"అడగండి" అన్నాను.

"మీ స్వవిషయం"

"పర్వాలేదు అడగండి"

"మీరు - మీరు పెళ్ళి ఎందుకు చేసుకోలేదు."

ఉలిక్కి పడ్డట్టు ఆమె ముఖంలోకి చూసాను. ఈ ప్రశ్న నన్ను పది సంవత్సరాల వెనకకు లాక్కుపోయింది. నా ఆలోచనలన్నీ సుళ్ళు తిరుగుతూ కల్యాణి గుండ్రటి కాటుక కళ్ళతో నా ప్రశ్నకు జవాబు వెదుక్కునే రోజులు గుర్తుకు వచ్చాయి

"చేసుకోలేదు." అన్నాను.

"ఎందుకు?"

'ఎందుకో నిజంగా నాకే తెలియదు.'

జీవితాంతం ఇలానే ఉండి పోతారా?'

'అంటే'

'బ్రహ్మచారిగా'

నరహరి నవ్వి 'వాడికి పెళ్లి కాలేదు అంతే గాని బ్రహ్మచారి కాడు.' అన్నాడు.

'ఇలాగే వుండి పోతాను' అన్నాను.

'ప్రేమకు ప్రాయశ్చిత్తం అది కాదు.'

'కాకపోవచ్చు నేను జీవితంలో చాల పొరపాట్లు చేసాను. అందులో కల్యాణిని ప్రేమించడం ఒక పొరపాటు అని అనుకుంటాను.'

గాయత్రి రెండు క్షణాలు మౌనంగాఉండి 'భలేవారు' అన్నది.

నరహరి కుర్చీలోంచి లేచి నుంచున్నాడు. దూరంగా రైలు గొంతు కీచుగా అరుస్తుంది. నరహరి వాచీ చూసుకుని 'మీ రిద్దరూ మాట్లాడుకుంటూ వుండండి. ఒక అరగంటలో వచ్చేస్తాను' అన్నాడు.

'ఎక్కడకి?' అడిగాను.

'పనుంది. ఇప్పుడే వచ్చేస్తాను.'

'నేనూ వస్తాను. పద వెళ్దాం.'

'నువ్విక్కడే వుండు' అని గాయత్రివైపు తిరిగి 'గాయత్రీ నీ ప్రసంగాలతో వీడిని అదరకొట్టబోకు.' అన్నాడు.' అన్నాడు నరహరి.

గాయత్రి పెద్దగా నవ్వింది.

'నేనేం కాదు. ఆయనే నన్ను అదరకొడ్తున్నారు.' అన్నది.

'కాదు గా నరహరి నేను కూడా...' అంటూ చెప్పబోయాను

"పోండూ! నీ మనసు ఇంకా ఎదగలేదురా." అన్నాడు.

నేనేం మాట్లాడేది, సన్నగా నవ్వి ఊరుకున్నాను. నరహరి మెట్లు దిగి వెళ్ళిపోయాడు. నేనూ, గాయత్రి మిగిలి పోయాము. గాయత్రి భుజాలనిండా చీర కప్పుకుంది. చల్లటి గాలికి ఆమె నుదుటి మీదున్న ముంగురులు వూగుతున్నాయి.

"మీరీరోజు చాల ఆలస్యం చేసారు. నిజంగా రారేమో అనుకున్నాను." అన్నదామె తన ఉజ్వల విశాల నేత్రాలలో స్నేహ లాలసాపూర్ణమైన మృదు మధుర సుందహాసాన్ని ప్రకాశింపచేస్తూ.

ఒక భూమికేకాదు, నవ్వుకు కూడా ఆకర్షణ శక్తి వుంది.

'అనుకోకుండా ఆలస్యమైంది.' అన్నాను.

"నాకు వంట చేయడం సరిగా కుదరదు. ఎవరేనా వచ్చినప్పుడు వంటలో అనుకోకుండా పొరపాట్లు జరిగి పోతుంటాయి. అటు వంటి పొరపాటేదేనా జరిగి వుంటే మన్నించండి."

'ఎంతమాట. నిజంగా చెప్పాలంటే ఈ రోజు వంట అద్భుతంగా వుంది. ఇలాంటి వంట తిని చాలారోజు లవుతుంది. మా అక్కయ్యకూడా వంట కూడా ఇలానే చేస్తుంది. కాని ఆమెలేదు. ఆత్మహత్య చేసుకుంది.'

గాయత్రి ఉలిక్కి పడ్డట్టు నా ముఖంలోకి చూసింది.

"ఎందుకు?"

'ఎందుకు చనిపోయిందో నాకే కాదు' ఆమె భర్తకుకూడా తెలియదు. చనిపోయేప్పుడు 'ఎన్నాళ్ళని ఈ నరకాన్ని భరించేది చచ్చిపోవాలని వుంది. అందుకే చచ్చిపోతున్నాను.' అని వ్రాసి చనిపోయింది...'

గాయత్రి బాధగా నిట్టూర్చింది కొద్దిసేపు ఎటో చూస్తూ కూర్చుండి పోయింది. నావైపు తిరిగి 'నాకూ ఒక్కొక్కప్పుడు అలానే అనిపిస్తుంటుంది' అన్నది.

(తరువాయి 21 వ పేజీ)

## ★ నీలి మెలికలు ★

(8 వ పేజీ తరువాయి)

'ఎలా ?'

'ఆత్మహత్య చేసుకుందామని'

గాయత్రి ముఖంలోకి పరీక్షగా చూసాను. తలక్రిందకు వంచుకుని కాలి బొటనవ్రేలితో నేలమీద వంకరలు చుట్టసాగింది.

'ఎందుకు ?'

'ఎందుకో నాకే తెలియదు' ఏమిటో అవ్యక్తంకాని భావన చచ్చిపోదామనే ఆలోచనతో చుట్టుకు పోతుంటాను'

కొద్దిసేపు ఆగి 'మీరు నాకో మాట యివ్వాలి' అన్నాను.

గాయత్రి తలెత్తి నా వంక చూసింది.

'ఏమిటి ?'

'మీరు ఆత్మహత్య చేసుకోనని మాట యివ్వండి.' అన్నాను.

గాయత్రి విరగబడి నవ్వుతూ 'భలేవారు నిజమనుకున్నారా— అయినా నేనంత పిరికి దాన్ని కాదు లెండి.' అన్నది.

"ఆత్మహత్య చేసుకునే వాళ్ళు పిరికి వాళ్ళు అంటే నేను ఒప్పుకోను. దానికి ఎంతో గుండె ధైర్యంకావాలి."

లేచినుంచుని సిగరెట్ వెలిగించుకున్నాను. పిట్టగోడ దగ్గరకు నడిచాను. వెన్నెల్లో ఒకే వరుసగా ఉన్న మేడలు అందంగా కనిపిస్తున్నాయి.

"మీరు ఆగ్రా వెళ్ళారా ?" వెనక్కు తిరిగాను.

"వెన్నెల్లో తాజమహల్ బావుంటుంది కదూ."

"మీ రెప్పుడు చూసారు ఇవన్నీ" అడిగాను.

"ఇక్కడకు వచ్చిన క్రొత్తలో పండు వెన్నెలలో తాజ్‌మహల్‌ను చూస్తూ వుంటే అలానే ఉండి పోదామనే భావం కలిగి పోతుంది."

నాకూ అలానే అనిపించింది. మిలటరీలో ఉండగా అక్కడకు ఒకసారి వెళ్ళాను. ఇక్కడో సంగతి చెప్పాలని అనిపిస్తుంది. అక్కడ నాతోపాటు బి. యస్. సి. చదువుకున్న ఒక అమ్మాయి రీసెర్చి చేస్తుందని తెలిసి యూనివర్సిటీకి వెళ్ళాను. ఆ అమ్మాయి పేరు రాజకుమారి. ఆ అమ్మాయితో నాకు బాగా పరిచయం వుంది. ఆ పరిచయాన్ని మించిన స్నేహాన్ని పునస్కరించుకునే రాజకుమారిని చూద్దామనే ఉద్దేశంతో వెళ్ళాను. నేను కాలేజీలోకి అడుగువెడ్తుండగా రాజకుమారి ఎదురైంది. ఎదురుగా వెళ్ళాను. నన్ను పలకరిస్తుంది అనుకున్నాను. ఎలా ఉన్నారు? ఏం చేస్తున్నారు ఇవన్నీ అడుగుతుందనుకున్నాను. రాజకుమారి నన్ను పలకరించలేదు.

'నేను గుర్తున్నానా' అన్నాను,

'ఎవరు ?' అన్నది రాజకుమారి

నా పేరు చెప్పాను మిక్లాన్‌మేట్‌ను అన్నాను. 'ఓహో అలాగా' అని వూరుకుంది,

నాకు నిజంగా బాధ కలిగింది. ఎందుకు పలకరించానా అనిపించింది. తప్పుకుని దారి యిచ్చాను. రాజకుమారి వెళ్ళిపోయింది, అందుకే నాతోపాటు చదువుకున్న వాళ్ళను పలకరించాలంటే నా కిప్పటికీ భయం.

'ఏమిటి ఆలోచిస్తున్నారు ?' అడిగింది గాయత్రి.

చెప్పాను

'కొంతమంది స్వభావాలు ఊసరవెల్లి వంటివి, వాటిని తలుచుకుని బాధపడవలసిన అవసరం లేదు.' అన్నది గాయత్రి. కొద్ది సేపు ఆగి, 'మీరు మిలటరీనుండి ఎందుకువచ్చేసారు? అడిగింది.

తలెత్తి గాయత్రివైపు చూసాను. 'మీకు నరహరి చెప్పలేదా ?' అడిగాను.

గాయత్రి తల అడ్డంగా ఆడించింది.

'నా ఆరోగ్యం బావో లేదు. టి. బి. వచ్చింది తీసి వేసారు కొన్నాళ్ళు పూనా మిలటరీ హాస్పిటల్ లో వున్నాను.' అన్నాను.

'రండి క్రిందకు వెళ్దాం. మంచు పడ్తోంది.' అన్నది గాయత్రి లేచి నుంచుని.

గాయత్రి మెల్లగా అడుగులు వేసుకుంటూ ముందుకు నడిచింది, ఆమెను అనుసరించాను,

నేను నా గదిలోకి వెళ్తుంటే 'ఉండండి హార్లిక్స్ త్రాగి వెళ్దురు' అన్నది.

'మీకుచాలకష్టం కలిగిస్తున్నాను'అన్నాను.

'అలా అనుకోవద్దు' అన్నదామె.

సోఫాలో కూర్చున్నాను. గాయత్రి పదినిమిషాలలో హార్లిక్స్ తీసుకువచ్చింది, నాకో కప్పు యిచ్చి తాను మరో కప్పు తీసుకుంది. హార్లిక్స్ ముగించేవరకూ ఇద్దరం ఎవ్వరం మాట్లాడుకోలేదు. తరువాత 'మీరెలా బ్రతుకుతారో నాకు అర్థంకావడంలేదు.' అన్నది గాయత్రి.

'అంటే ?'

'మీరు తాపత్రయ పడటానికి ఎవ్వరూ లేకుండా, మీ కోసం తాపత్రయపడటానికి ఎవ్వరూ లేకుండా'

ఆ క్షణంలో నామీద నాకే జాలి వేసింది. అంతే. నా జీవితం ఇలా నిస్సారంగా గడచిపోతుంది. బాధగా నవ్వాను.

కొద్దిసేపు ఆగి, 'వచ్చే పున్నమికి మీ కష్టాలన్నీ గట్టెక్కిపోతాయి.' అన్నాను,

గాయత్రి నా ముఖంలోకి పరీక్షగా చూసింది.

'మీకు ఎలా తెలుసు ?

ఏమిటి ?

'మాకు కష్టాలున్నాయని'

నవ్వాను.

'కొంపదీసి మీరేం జ్యోతిష్యులు కాదు కద" అన్నది పెద్దగా నవ్వుతూ.

'మీకు తెలియదా నరహరిచెప్పి ఉండడు నాకు జ్యోతిష్యం తెలుసు.'

'ఓహో : అలాగా. నాకు తెలియనే తెలియదు.' అని గాయత్రి గంభీరభావంతో తదేకంగా నావైపు చూస్తుండి పోయింది. కొద్ది సేపు ఆగి తన చేయిచాపి 'మీరు జ్యోతిష్యులైనప్పుడు చేయి చూడటం బాగా తెలిసివుండాలి, నా చేయి చూసి నా భవిష్యత్ చెప్పండి.' అన్నది.

రెండుక్షణాలు చకితభావంతో గాయత్రి వైపు చూస్తుండిపోయాను.

'చూడండి' తన చేయి మరికాస్త ముందుకు చాపింది గాయత్రి.

సంకోచిస్తూ గాయత్రి చేయిపట్టుకున్నాను ఆమెలో ప్రతి కదలిక చూపు. మాటలు నాకెందుకో సున్నిత రహస్యంగా కనిపిస్తున్నాయి.

'ఏమి చెప్పమంటారు ?' అడిగాను.

'నా భవిష్యత్ గురించి'

'అంటే?'

'నా ఆయుస్సు - ఇలాటివన్నీ'

'మీరు చనిపోయేవరకూ బ్రతుకుతారు.'

గాయత్రి నిండుగా నవ్వి, 'ప్లీజ్ చెప్పండి.' అన్నది.

'మీ భవిష్యత్ కేం చాల చక్కగాఉంది.'

'అంటే?'

'మహోజ్వలంగా ఉంది.'

గాయత్రి నిట్టూర్చింది.

'అంతేనా?'

'అంతే!'

'కొద్దిగా అర్థమయ్యేట్టు చెప్పండి.'

'ఇంకెలా చెప్పమంటారు?'

'నిజంగా నా భవిష్యత్ గురించి నాకు చాల చింతగా వుందండీ' అన్నది

లాలసాపూర్ణమైన ఆమెకళ్ళు, ఆమెచేతిలో కనిపిస్తున్న అస్వాభివక మందోష్ణం నాకు ఆదోలా కనిపించాయి.

చటుక్కున ఆమె చేయి వదిలి. 'నిజంగా నాకు జ్యోతిష్యం రాదండీ. కనీసం జ్యోతిష్యం అంటే కూడా నాకు నమ్మకం లేదు. గమ్మత్తుగా అన్నాను. అంతే' అన్నాను.

గాయత్రి నిరుత్సాహపడిపోయింది. నవ్వి 'భలేవారు' అన్ని, కొద్దిసేపు ఆగి, మీకు తెలీదేమోను నాకు జ్యోతిష్యము వచ్చు 'అన్నది' నవ్వాను.

'మీరు నమ్మడం లేదు. నాకు నిజంగా జ్యోతిష్యం తెలుసు. ఏదీ మీ చేయి యిలా యివ్వండి.' అని నాచేయి పట్టుకుని ముందుకు లాక్కుని పరీక్షింపసాగింది.

'మీరు క్రొత్త అనుభవాలను చవిచూస్తారు' అన్నది.

'అంటే?'

అందరి ప్రేమాదరణలు సతతం మీకు తోడుగా ఉంటాయి.'

'ఎవరివి? నా కెవ్వరూ లేరుకద.'

'స్త్రీలవి'

ఉలిక్కిపడి చకితభావంతో ఆమె కళ్ళల్లోకి చూసాను.

'నిజమేనా?'

గాయత్రి పక పకా నవ్వేసింది. 'నాకసలు జ్యోతిష్యం రాదు. ఊహించాను. అంతే' అన్నది.

నేను నిశ్చేష్టతలో మెలికలు తిరిగి పోసాగాను. నాకేమీ అర్థంకావడంలేదు. నా ఆలోచనలు ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయి. ఆ యింట్లో మేమిద్దం తప్ప ఎవరూ లేరు. మంచో, చెడో నేనే పరిస్థితిలో ఉన్నానో గ్రహించాను. గాయత్రి చేతులోని అస్వాభివక ఉష్ణం నా నరనరాన్ని కాల్చివేయసాగింది. సుదీర్ఘంగా, వేడిగా, బరువుగా ఉన్న ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నిర్జన గృహంలోని ఆ ఏకాంత పరిస్థితిలో గాయత్రి విహ్వలత. నా మనసు అనుకొని అశాంతికి గురికాసాగింది. ఆమె ఉష్ణం నా నర నరాల్లోకి ప్రాకి ఉద్భ్రాంత గదిలోకి ప్రవహిస్తున్నది.నా నరాల్లో సంచలనం కలుగుతోంది. నా రక్తం వేగంగా నరాల్ని చీల్చుకుంటూ పరుగెత్తుతుంది. లేని ఆమె నడుం చుటూ చేయివేసి పెదాలమీద ముద్దుపెట్టుకుని ముందుకు లాక్కున్నాను. ఆమె వెనక్కు ఒరిగిపోయింది అంతే అంతా నీరవంగా జరిగిపోయింది

జబల్‌పూర్ వచ్చిన రెండు వారాలకు గాయత్రి దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది. విప్పాను. '—మీకు ఎలా వ్రాయాలో నాకే అర్థంకావడంలేదు. మీరు పంపిన డబ్బు అందింది, అయనా సంతోషించారు ఆ రాత్రి నా గురించి, నా జీవితం గురించి మీకు చాల చెప్పాలనుకున్నాను. కాని, ఏదో అజ్ఞాతశక్తి నా గొంతు నొక్కివేసింది నాకు నా అన్నవాళ్ళు ఎవరూలేరు పురుషుడి అండలేని స్త్రీ జీవితం నేను ఊహించగలను. అండ ఉండికూడ నేనెంత నికృష్టపుజీవితాన్ని గడుపుతున్నానో మీరు ఊహించుకోండి ఆయన చెప్పినట్లు చేయకపోతే నా గతేమౌతుందో నాకు తెయిసు. మా విషయాలు మీకు అసఅసహ్యం కలిగిస్తున్నాయి కదూ. అందుకనే అనిపిస్తుంది చచ్చిపోదామని. గాయత్రి'

నా గుండెలలో ఎవరో చేయిపెట్టి కెలికినట్లనిపించింది, ఆ ఉత్తరం నాలుగైదుసార్లు చదివాను. చదివేకొద్దీ నా హృదయం బాధామయమై పోసాగింది. నరహరిలో కనిపించే అవసరాన్ని మించిన స్నేహంతోనే నాకు ఇన్నాళ్ళూ పరిచయం ఉంది. అభావా భంగిమలు ఎవో అసంభవ విషయాల్లా గోచరించసాగాయి. నీలి తెరలు మెల్లగా అల్లుకుంటున్నాయి. మసక మసకగా కృష్ణ నిశీదాలలో అంతనిరూపు కలసిపోసాగింది అలానే కళ్లు మూసుకున్నాను.

◆ ◆ ◆ ◆

'భగవాన్ ! గాయత్రి ప్రస్తుతం ఎక్కడ వుందో నాకు తెలియదు. నువ్వొకవేళ వుంటే ఆమె ఆత్మను షప్పక కాపాడు; ఆమెకో ఆత్మ వుంటే.'

